భం
# గురువాణి
23 ఏప్రిల్, 2026 సంచిక-257



## నిజమైన శిష్యుని లక్షణం

నిజమైన శిష్యుని లక్షణం ఏమిటి ? గురువులకు ఎంతోమంది శిష్యులు ఉంటారు. ఉన్నటువంటి శిష్యులు అందరూ ఉత్తములేనా అన్నది ఒక ప్రశ్న? లేదు చాలామంది అవకాశవాదులు ఉంటారు, పిల్లి మొక్కులు మొక్కే శిష్యులు ఉంటారు. మరి వారిని ఎలా తెలుసుకోవాలి? అణకువతో స్వామి స్వామి అంటూ నమస్కరిస్తూ ఉంటారు. అయితే నిజమైనటువంటి శిష్యుని యొక్క గొప్పతనం ఎప్పుడు తెలిసి వస్తుంది అంటే చూడండి ఒక ఇనుప ముక్క మరియు ఒక ఎండుటాకు రెండింటిని ప్రక్క ప్రక్కనే పెడితే గాలి లేనంతవరకు అవి రెండు బాగానే ప్రక్క ప్రక్కనే ఉంటాయి. భయంకరంగా గాలి వీస్తే ఆ ఆకు చాలా దూరంలో పడుతుంది, కానీ పక్కనే ఉన్నటువంటి ఇనుప ముక్క అక్కడే చెలించకుండా ఉంటుంది.

అదేవిధంగా పరిస్థితులు ఏమైనా ప్రతికూలంగా ఉంటే ఈ పిల్లి మొక్కులు మొక్కే శిష్యులు అక్కడనుండి పారిపోతారు, నిజమైన శిష్యుడు మాత్రం ఏ కష్టం సంభవించినా, ఎంత నష్టం వచ్చినా

ఎంతటి భయంకరమైన పరిస్థితులు ఏర్పడినప్పటికీ తాను ధీరుడై అక్కడే నిలబడతాడు. ఇది నిజమైన శిష్యుని యొక్క లక్షణము. అయితే కాలాన్ని బట్టి చూస్తే ఎటువంటి శిష్యులు ఉన్నారంటే ఒక మంచి ఉదాహరణ చూడండి జీసస్ క్రైస్తు (Jesus Christ) దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు, అతని పేరు జుడాస్ ఇస్కారియోట్ (Judas Iscariot), క్రీస్తు యొక్క 12 మంది ముఖ్య శిష్యులలో ఇతను కూడా ప్రముఖ శిష్యునిగా ఉండేవాడు. ఇస్కారియోట్ కాదు వాడు ఒక ఇడియట్. వాడు మహానుభావుడైన జీసస్ క్రైస్తును 30 వెండి నాణెములకు ఆశపడి అప్పటి రాజులకు పట్టిస్తాడు. తనని ముఖ్యమైనటువంటి శిష్యునిగా ఎన్నుకున్నప్పటికీ అవకాశం చూసి సమయా సందర్భం చూసి తన గురువు అయిన జీసస్ క్రైస్తుని కేవలం 30 నాణేలకు రాజుకు పట్టిస్తాడు.

ఇటువంటి స్వార్థపూరిత శిష్యులు కూడా ఈ సమాజంలో ఉన్నారు. ఇదంతా ఎప్పుడు తెలుస్తుంది అంటే పరిస్థితులను బట్టి తెలుస్తుంది. పరిస్థితులు ప్రతికూలంగా లేనంతవరకు వీరు నిజమైన శిష్యులే అని అనిపిస్తుంది. అయితే ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడే నిజమైన శిష్యుని యొక్క గొప్పతనం తెలుస్తుంది.

అందువల్ల శిష్య భక్తాదులారా నిజమైన శిష్యుడు ఎప్పటికీ సర్వకాల సర్వావస్థల యందు ఆ సద్గురువుని ఆశ్రయించి గురువు యొక్క కృపకు పాత్రుడై తరించడానికి ప్రయత్నిస్తాడు. కనుక శిష్య భక్తాదులారా మీరందరూ కూడా ఒక సద్గురువుని ఆశ్రయించి ఆయన దగ్గర నిజమైన శిష్యులుగా, నిజాయితీగల శిష్యులుగా రాణించి ఆ సద్గురు యొక్క కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

